# సంస్కరణ....శారద

కె. సురేష్‌బాబు

సంస్కరణ లేదా సంస్కర్త అనగానే ఒక రకమయిన గౌరవభావం మనలో కలుగుతుంది. సంస్కర్తల్ని మానవాతీతులుగా విశ్వసించేవారూ ఉన్నారు. సాధారణంగా సంస్కరణ సమాజంలో చిన్న చిన్న మార్పుల్ని ఉద్దేశించి ఉంటుంది-- ఆయా మార్పుల్ని భూతద్దంలో చూసి ఆనందించే వారికి తప్ప.

సంస్కరణావాదం సమాజంలోని ఏ సమస్యనూ పూర్తిగా పరిష్కరించలేదు. సమస్య మూలాల్ని పరిశీలించి ఆయా మూలాల్ని సమూలంగా నిర్మూలించే పోరాటమే మౌలికమయిన మార్పును తేగలుగుతుంది. సంస్కరణ ఉపరితలంలోని అంశాలకు పరిమితమయిఉంటుంది. చాలామంది సంస్కర్తలు పునాదిని గురించి ఆలోచించిన దాఖలాలు లేవు.

'శారద' (ఎస్.నటరాజన్) రచించిన ఈ కథలోని సంస్కర్త పునాది సంగతలా ఉంచి ఉపరితలాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. అసలు దొంగ సంస్కర్తేమో అన్పిస్తుంది కాసేపు. కానీ ఈ సంస్కర్త మోసగాడన్నది కాదు శారద ఉద్దేశ్యం. అతడు ప్రవచించే సంస్కరణే బూటకం అని చెప్పదలుచుకున్నాడు.

బజారులో సంస్కర్తా, సామాన్యుడూ ఎదురుపడ్డారు.

హరిజనుల్ని ఉద్ధరించాలంటే దేవాలయ ప్రవేశం కల్పించాలి- అని సంస్కర్త అంటాడు. సామాన్యుడికి మనకొచ్చే సందేహమే కల్గి "పాతికేళ్లనుంచి దేవుణ్ణి ప్రార్థిస్తూనే ఉన్నాను. ఏమీ ఊడి పడలేదు నాకు. వాళ్లకి మాత్రం....." అనబోతుంటే "పెద్దల్ని ఇలా ప్రశ్నించకూడదు' ' అని నోరుమూయిస్తాడు ఇందులోని సంస్కర్త.

*1948* లోనే కాక అలాంటి సంస్కర్తలు ఎప్పుడూ ఉంటారని మన అనుభవం ద్వారా తెల్సుకోవచ్చు. (ఇవ్వాళ దళితుల్ని ఉద్ధరించాలంటే అసెంబ్లీ ప్రవేశం కల్పించాలి అంటున్నతీరులో). అలాని సంస్కర్తలందరి నిజాయితీనీ శంకించనక్కర్లేదు. నిప్పులాంటి నిజాయితీ ఒక్కటే సరిపోదు. సంస్కరణ పైపైపూత మాత్రమే కనుక శస్త్ర చికిత్స అవసరం అని తెలుసుకోవాలి.

శారద కూడా ఆదిలో సంస్కరణ పట్ల భ్రమల్లో ఉండి తరువాత మౌలికమయిన మార్పుని కోరుకున్నాడనీ ఆ క్రమంలోనే ఈ కథ రాశాడనీ అర్థం చేసుకోవాలి. క్లుప్తత, సులభయిన శైలీ, చిన్నవాక్యాలూ శారద ప్రత్యేకతలు. ఉన్నతమయిన ఆదర్శాలూ, కమ్యునిజం పట్ల నిబద్దతా శారదని ప్రథమశ్రేణి రచయితగా నిలబెట్టాయి.

హోటల్ వర్కర్‌గా రోజుకి పన్నెండు గంటలు శ్రమిస్తూ, దుర్భరమయిన దారిద్ర్యంలో, పుస్తకాలు సైతం కొనుక్కోలేని స్థితిలో ఏడు సంవత్సరాల్లో *(1948-1955)* ఆరు నవలల్ని, ఒక నాటికనూ, ఒక ఇంగ్లీషు పుస్తకానికి అనువాదాన్ని, దాదాపు వందకథల్ని రచించ గల్గటం బహుశా తెలుగు సాహితీ చరిత్రలోనే అపూర్వం. ఈ అద్భుతమయిన సాహితీ సృజన చేసిన శారద తెలుగువాడు కాదు తమిళుడని తెల్సుకుంటే మనం ఆశ్చర్యానందాలకి గురవుతాం. తెలుగు నేర్చుకునేందుకు అనంతంగా శ్రమించి ఇంతపట్టు సాధించటం విశేషం.

"రచయిత తన ఆదర్శాన్ని ఊకదంపుడు ఉపన్యాసంగా చెప్పరాదు. తను చెప్పదల్చుకున్న ఆదర్శాన్ని పూసలో దారంలా ఉండాలి" అని విశ్వసించిన శారద తన రచనల్లో దాన్నే ఆచరించాడు. ఇవ్వాల్టి ఔత్సాహిక రచయితలకూ, ఉన్నత సాహితీ సృజనపై అభిమానం ఉన్నవారికీ శారద రచనలు అందవల్సిన అవసరం ఉంది. అలాంటి ప్రయత్నం బహుశా ఒక చారిత్రక అవసరంలో భాగం.

---

**నాకు నచ్చిన కథ**

# సంస్కరణ ..... శారద

సంస్కర్త సామాన్యుడూ ఎదురు పడ్డారు పెద్ద బజారులో. సంస్కర్త సామాన్యుడి భుజం మీద చేయివేసి, "ఏమోయ్, ఇంత పాడై పోయావేం?" అని అడిగాడు

సామాన్యుడు అనుమానం వేసి తన వంక తనే చూసుకున్నాడు కాసేపు. జేబు దగ్గిర చిరిగినషర్టు బిళ్ళగోచీ పంచె, పైని తుండుగుడ్డ. కొంచెం చెరగినక్రాపూ జేబులో పావలా డబ్బులూ, తనేమీ మారలేదే? సామాన్యుడు తలెత్తి సంస్కర్తలోకి చూసి, "నేనేం పాడైపోయానండి? మామూలుగానే ఉన్నాను" అన్నాడు.

సంస్కర్త మోకాళ్ళ వరకూ వేళ్ళాడే ఖద్దరులాల్చీ, జీరాడే గ్లాస్కో పంచె, పైకి దువ్విన అమెరికన్ క్రాప్, గోవాడ పై పంచె, కొల్హాపూర్ స్లిప్పర్లు తొడుక్కొని, సామాన్యుణ్ణి చలవ సులోచనల్లో గుండా తీవ్రంగా చూసి. "నువ్వంటే నువ్వేకాదోయ్, అసలు సంఘమే పాడైపోయింది." అన్నాడు ఆదుర్దాగా.

సామాన్యుడు తలగోక్కుని, "గావును. ఎవ్వరితోనూ చెప్పకుండా అట్లా చెడిపోడం ఏమిటండి," అన్నాడు సీరియస్‌గా.

సంస్కర్త సులోచనాలు పై పంచెతో తుడుస్తూ, "సంఘం అనేక విధాలపాడైపోతోంది. తెలుసా?" అన్నాడు మరీ ఆదుర్దాగా.

సామాన్యుడు తాపీగా ఒక తాడ్‌మహల్ బీడి వెలిగించి, "పోతే పోనీండి, మనకెందుకూ మధ్య" అన్నాడు పరాకుగా.

సంస్కర్త కోపంగా చూశాడు సామాన్యుణ్ణి. తర్వాత సులోచనాలు తగిలించుకొని, "మనకి కాకపోతే, ఇంకెవ్వరికి పడ్తుందోయ్, చూడు. సంఘంలో హరిజనులు అణగారిపోతున్నారు."

"నిజమే మరి" అన్నాడు సామాన్యుడు.

"వాళ్ళకి దేవాలయ ప్రవేశం ఇప్పించాలి మనం" అన్నాడు సంస్కర్త.

సామాన్యుడికి అనుమానం వేసింది. మాలవాళ్ళు అణగారిపోతుంటే చదువు చెప్పించాలి, అన్నం పెట్టించాలిగాని, దేవాలయ ప్రవేశం ఏమిటి వాళ్ళని మోసం చెయ్యటం కాకపోతే? సామాన్యుడు సంస్కర్తని ఎగాదిగా చూసి "వాళ్ళకి దేవాలయ ప్రవేశం ఎందుకండీ? ఉన్న మతిపోవడానికా?" అని ఆగాడు.

దాంతో సంస్కర్త సామాన్యుణ్ణి రోడ్డు పక్క అరుగు మీద కూర్చో బెట్టి, "వాళ్ళకి దేవుణ్ణి దర్శించేహక్కు ఇప్పించాలయ్యా" అన్నాడు కోపంగా.

సామాన్యుడికి ఇంకా అనుమానంవేసి, "దేవుణ్ణి ప్రార్థిస్తే సరిపోతుందంటారా? ఇప్పటికి పాతికేళ్ళ బట్టి నేను దేవుడిని ప్రార్థిస్తూనే వున్నాను. ఏమీ ఊడిపడలేదు నాకు వాళ్ళకి మాత్రం..." అని ఇంకేదో చెప్పబోతుంటే, సంస్కర్త సామాన్యుడిని ఆపి, ఆ సమస్య తప్పించేసి, "అది పోనీ వయ్యా, నీ కన్నీ సందేహాలే. ఇటు చూడు, సంఘంలో స్త్రీ స్వాతంత్ర్యం లేక అల్లాడి పోతోంది" అన్నాడు.

సామాన్యుడు ఆలోచించాడు, "నిజమేననుకోండి. మా ఆవిడ 'చదువుకోవే' అని మొత్తుకున్నా చదవడంలేదండి. ఏం చెయ్యను?" అని అడిగాడు సంస్కర్తని.

సంస్కర్త సామాన్యుడిని కొంచెం చుర చురచూసి, "మీ ఆవిడ సంగతీ, మా ఆవిడసంగతీటోయ్ మనం మాట్లాడేదీ" అన్నాడు.

సామాన్యుడు కాస్త తగ్గి "మా ఆవిణ్ణి, మీ ఆవిణ్ణీ మినహాయించా మీరు మాట్లాడుతోంది? క్షమించండి" అన్నాడు.

సంస్కర్త మళ్ళీ మాట తప్పించి, "నీకు బొత్తిగా సంస్కరణ అంటే ఏమిటో తెలియడంలేదోయ్" అన్నాడు విసుగ్గా.

"నాకెట్టా తెలుస్తుందండీ, సామాన్యుడిని" అన్నాడు సామాన్యుడు వినమ్రతగా.

సంస్కర్త ఎందుకో జేబులు తడవుకొని, "ఒక బీడీ ఉంటే ఇవ్వవోయ్." అని అడిగాడు సామాన్యుడిని.

సామాన్యుడు బీడీ, నిప్పెట్టా రెండూ ఇచ్చి, "అయితే మహాశయా సంఘం అంతా పాడైపోయిందంటారా?" అని అడిగాడు భయంభయంగా.

"మెల్లగా అంటావేమిటి" అన్నాడు సంస్కర్త బీడీ వెలిగిస్తో.

"అయితే ఎట్లా?"

"సంస్కరణ చెయ్యాలి."

"అంటే?"

"మళ్ళీ మొదటి కొచ్చేవోయ్. మొదట హరిజన సమస్య, ఆ తర్వాత స్త్రీ జనోద్ధరణ, ఆ తర్వాత...



"ఇంతకీ సామాన్యులు బతికే ఉపాయం, దరిద్రం ఒదిలే మార్గం.... అవేమీ మన సంస్కరణ ప్రణాళికలో ఉండవా యేమండి?" అన్నాడు సామాన్యుడు మామూలుగా.

"అవన్నీ పాశ్చాత్య వాసనవల్ల వొచ్చిన పాడు మనస్తత్వమోయ్, ఒకడి దరిద్రం ఒదిలించేందుకు మన మెవరిమోయ్, అదంతా సృష్టి విలాసం. .భగవదేచ్ఛ:" అన్నాడు సంస్కర్త గుడ్లు తేలేసి.

సామాన్యుడు ఈ వివరం నిజమని నమ్మలేకా, కాని పెద్ద మనిషిని వ్యతిరేకించలేకా, "పోనీ హరిజనోద్ధరణ, భగవదేచ్ఛకి ఒదిలి. స్త్రీ స్వాతంత్ర్యం విధికి వొదిలితే చిక్కు వొదులుతుంది కదండి?" అన్నాడు.

సంస్కర్త సామాన్యుడిని ఎందుకోగాని మింగేద్దామా అన్నట్టుజూసి "నీవు ఇట్టా అడ్డదిడ్డంగా మాట్లాడ గూడదోయ్, తెలిసీ, తెలియకా" అన్నాడు.

సామాన్యుడికి ఈ మందలింపు అర్థం కాలేదు. "తను మాట్లాడవేగూడదా?"

"యేమండి. నేనసలు మాట్లాడే గూడదంటారేవిటి? అందుకన్నా నాకు స్వేచ్ఛ లేదూ?" అని అడిగాడు కాస్త చికాకుగా.

సంస్కర్త జేబులోంచి ఓ కాయితం తీసి, "నువ్వు పెద్దల్ని ఇట్లా ప్రశ్నించకూడదు. ఇదిగో నువ్వుకూడా మా సంఘసంస్కరణోద్యమ సంఘంలో చేరు. చందా పావలా మాత్రమే" అన్నాడు.

సామాన్యుడు,

'ఏడ్చినట్టుంది వ్యాపారం' అని మనసులో అనుకొని, పావలా బిళ్ళ జేబులోంచి తీసి సంస్కర్త చేతిలో పెట్టి. "చేర్చుకోండి నన్నూ ఓ సభ్యుడిగా--" అన్నాడు గత్యంతరంలేక.

సంస్కర్త సంతోషంగా పావలా జేబులోకి వెట్టి, సామాన్యుడికి ఓ రశీదు పుస్తకం చూపించి, "నువ్వూ ఇక సంస్కర్తవోయ్, ఈ పుస్తకం తీసుకొని ఇంకా మెంబర్లని చేర్పించు. మన ఆశయాలు చెప్పి." అన్నాడు వెళ్ళడానికి సిద్ధపడి.

కాని సామాన్యుడు పుస్తకం తీసుకోకుండా, "ఏబ్బే! నాక్కొంచం వేరే పన్లున్నయిలెండి." అని మర్యాదగా నిరాకరించి వెళ్ళిపోయాడు. అక్కడ నుండి సంస్కర్త. "వీళ్ళకేం తెలుసు సంస్కరణ అంటే." అనుకుంటూ, కాళికాంబ కఫేలోకి పోయినాడు.

# ఉరిశిక్ష

తస్లీమా నస్రీన్

తెలుగు సేత - జొన్నలగడ్డ హసీనా



ఇదిగో, యిక్కడే వున్నాను.
నా వొంట్లో జబ్బులున్నాయేమో పరీక్షించు.
స్నానం చేయించు.
నా చివరి కోరికేదో అడుగు.
చివరగా యేం తినాలని వుందో కూడా
అడుగుతావుగా!
బసుమతి బియ్యంతో వండిన అన్నం?
లాబ్స్టర్స్?
వేయించిన కోయ్?
చింతపం ఊరగాయ?
ఆవంటిలో మాగిన కాయా?
ఏదిష్టం నాకు?
ఎవరిని చూడాలనుంది?
తల్లినా?
తండ్రినా?
అన్ననా?
స్నేహితుణ్నా?
మరే ఆత్మీయుడైన మరొకణ్నా?
నా కెవరూ వొద్దు
ఏదీ వొద్దు.

నేను కోరేది విని ఆశ్చర్యపోకు.
నా ముఖం వంక చూసి మొద్దుబారకు.

నాకు మహోన్నతమైన లోకం కావాలంటే
తెచ్చివ్వగలవా?
పొలాల గట్లన్నీ పోయి
ముళ్ళతీగెల హద్దులు తెగి
దేశాలమధ్య గొడవలూ తగాదాలూ పోయి
వసుధైక కుటుంబం కావాలన్ననుకో,
తెచ్చిస్తావా?
వర్గాలూ మతాలూ సమసి
స్త్రీలూ పురుషులూ సమానంగా బతికే సమాజం
నాక్కావా విస్తావా?
కనీసం ఆ అందమైన లోకాన్ని
దూరంగానైనా చూపుతావా?
చూపుతావా.
తృప్తిగా సంతోషంగా ఉరికంబాన్నెక్కి
శవాన్నై వూగుతాను.

చూపలేవా,
బలమైన యీ వురితాడు
తెంచి పారేస్తాను.
నువ్వు చూస్తుండగానే యెక్కడికో
మెరుపులా మాయమవుతాను.
చావటానిక్కాదు,
నా కలలు
ఓ వంతు భూమ్మీద
రెండొంతులు నీటిమీద
నాటుకుపోతూ, బతకటానికి!